# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాదిగారు మొట్టమొదటిసారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

Use plain, simple language, short words and brief sentences. That is the way to write English -- it is the modern way and the best flowers way. Stick to it; don't let fluff and verbosity creep in. When you catch an adjective, kill it. No, I don't mean utterly, but kill most of them -- then the rest will be valuable. A wordy habit, once fastened upon a person, is as hard to get rid of as any other vice." --*Mark Twain*

## కొంపెల్ల విశ్వం

1970లలో ఆంధ్రప్రభ వీక్లీలో నేను కథలు రాసేప్పుడు నా కథలు బావున్నాయని ప్రచురింపబడ్డ ఉత్తరాల్లో వి.మధుసూధనరావు, కొంపెల్ల విశ్వం కలిసి రాసే ఉత్తరాలు ఉండేవి. ఆ తర్వాత శ్రీ కొంపెల్ల విశ్వం రాసిన 'రంగు వెలిసిన బొమ్మ' అనే కథ కూడా ప్రభలో ప్రచురింపబడింది. 1976 అక్టోబర్‌లో ఈనాడు సంస్థ నుంచి సితార వీక్లీ మొదలైంది. మొదట్లో పన్యాల రంగనాధరావుగారు సితార ఎడిటర్ అని గుర్తు.

సితార వీక్లి ఎడిటర్‌గా శ్రీ కొంపెల్ల విశ్వం 1976 నుంచి 1980 దాకా పనిచేసారు. విశ్వం సీట్ విపుల, చతుర ఎడిటర్ చలసాని ప్రసాదరావు గారి పక్క సీటే కాబట్టి శ్రీ చలసానిని కలవడానికి వెళ్ళినప్పుడల్లా విశ్వం పలకరించేవారు.




ఆంధ్రప్రభలో నా కథలు చదివి ఉత్తరాలు రాసింది ఆయనే అని మాటల్లో తెలిసింది. ఆయన కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి. ఆ విషయం చెపుతూ, బ్లూ మూన్ హోటల్లోని బార్‌లో తను కొంతకాలం బేరర్‌గా పని చేసానని కూడా చెప్పారు. సితార ఎడిటర్‌గా అతనిలో ఓ విధమైన అభద్రతా భావం నాకు కనపడేది. శ్రీరామోజీరావు తన గదిలోంచి బయటకి వచ్చి చూస్తే, ఆ విశాలమైన హాల్‌లో ఎవరు ఆఫీస్‌లో ఉన్నారు, ఎవరు లేరు అన్నది కనిపించేది. కాబట్టి శ్రీ విశ్వం రామోజీరావుగారు ఇంటికి వెళ్ళేదాకా తన కుర్చీలోంచి కదిలేవారు కారు. నాతో మాట్లాడుతూనే ఆయన తలుపు చూస్తూండేవారు. ఓ నాటి పాఠకుడైన విశ్వంకి కథా రచయితగా నా మీద అభిమానం ఉన్నా, పాఠకుడి నుంచి ఎడిటర్ స్థాయికి ఎదగగానే కలిగే అభిజాత్యం వల్ల కావచ్చు ఆ అభిమానం పోయింది అని నాకు అనిపించింది. సితారకి నా చేత పెద్దగా రాయించలేదు. చాలామంది రచయితలని సినిమాలకి రివ్యూలు రాయమని కోరినా నన్ను అడిగేవారు కారు. కమల్‌హాసన్ హీరోగా వెలువడ్డ బాలచందర్ సినిమా 'మరో చరిత్ర'కి, ప్రభ హీరోయిన్‌గా నటించిన ఓ చిత్రానికి మాత్రం రివ్యూ రాసిచ్చాను. సినిమాలోని అనేక విభాగాల మీద నా అంతట నేనే వ్యాసాలు రాసిస్తే వేసారు. మాంటేజెస్ షాట్స్ గురించి, అవుటాఫ్ ఫోకస్ దృశ్యం గురించి, మద్రాస్ లోని ప్రివ్యూ థియేటర్స్ గురించి. ఇలా.

ఆ సమయంలో నేను చిక్కడపల్లిలో ఓ గదిలో అద్దెకి ఉండేవాడిని. ఓసారి వారింటికి ఆహ్వానిస్తే వెళ్ళాను. అతని భార్య పేరు జ్యోతిర్మయి. ఆమె కవిత్వం రాసేవారు. వారికి ఇద్దరు పిల్లలు అని గుర్తు. ఒక కొడుకు, ఒక కూతురు. తర్వాత నేను ఆ గది ఖాళీ చేసేసాను.

కొంతకాలం తర్వాత జ్యోతిర్మయి మరణించింది అని విన్నాను. ఆ తర్వాత సితారకి రాజీనామా చేసి విశ్వం మద్రాస్‌కి షిఫ్ట్ అయ్యారు. ఓసారి నేను మద్రాస్ నుంచి హైదరాబాద్ వస్తూంటే, మద్రాస్ ఏర్‌పోర్ట్‌లో నాకు కనిపించారు. సినిమాలకి రచనలు చేస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం ఆయన తమిళ టీ.వి సీరియల్స్‌కి రాస్తున్నారని ఎవరో చెప్పారు.

## శ్రీ కంఠమూర్తి


శ్రీకంఠమూర్తి

1980లో విశ్వం తర్వాత శ్రీకంఠమూర్తి సితారకి ఎడిటర్ అయ్యారు. ఆయన కూడా నియమం పెట్టుకున్నట్లుగా నన్ను రాయమని ఎన్నడూ అడగలేదు. చలసానిగారికి మాత్రం నేను సితారకి రాయాలని ఉండేది. కానీ తన నిబద్ధత వల్ల ఆయన ఆ విషయం నాతో అనేవారు కారు. 'శ్రీ కంఠస్ఫూర్తి' పేరుతో ఆయన బయటి పత్రికలకి కథలు రాసేవారు. ఈనాడు సంస్థలో పనిచేస్తూ, బయటి పత్రికలకి రాయకూడదనే నియమం ఉన్నా, ఈయన మాత్రం కలం పేరుతో రాస్తూ దాన్ని పాటించలేదు. ఆయన ఎప్పుడు కనపడ్డా పలకరింపుగా నవ్వి, ఎలా ఉన్నారని రెండు మూడు నిమిషాలు తప్పకుండా మాట్లాడేవారు.



ఎవరితోనూ ఎలాంటి వివాదం లేని సౌమ్యుడు. రిటైర్మెంట్ తర్వాత కూడా ఆయన సితార ఎడిటర్‌గా 1998 దాకా, అంటే పద్దెనిమిదేళ్ళు కొనసాగారు. ఆయనకి ఆరోగ్యం బాగాలేదని విన్నాను. ఆ తర్వాత ఆయన పోయారని, పేపర్లో చదివాక కేన్సర్ వల్ల పోయారని తెలిసింది. ఆయన తర్వాత శ్రీ మోహన్ గోటేటి సితార వారపత్రిక ఎడిటర్ అయి, 2007 దాకా పనిచేసారు. అటు తర్వాత శ్రీ వి.ఎస్.కె చక్రవర్తి ఇప్పుడు సితార ఎడిటర్‌గా కొనసాగుతున్నారు.

**కె.బి.లక్ష్మి**


కె.బి.లక్ష్మి

చలసానిగారు పోయాక చతుర, విపుల విభాగంలో పనిచేసే కె.బి.లక్ష్మిగారు వాటికి ఎడిటర్ అయ్యారు. ఆ తర్వాత విపులకి నేను పంపే రచనలు ప్రచురించబడటం ఆగిపోయింది. చతుర మంత్లీకి చతుర ప్రపంచం మాత్రం అడిగి రాయించుకునేవారు. ఆవిడ ఒకటి, రెండుసార్లు వాటి కోసం ఫోన్ చేసినప్పుడు 'మీకు వాటికి మూలం ఎక్కడ దొరుకుతుంది? నేను మా ఈనాడు లైబ్రరీలో వెదికినా నాకు దొరకడం లేదు' అన్నారు. బహుశ ఆల్టర్‌నేటివ్ దొరికి ఉంటే ఆ శీర్షిక కూడా నా నుంచి తీసుకునేవారు కారు. నేను కె.బి.లక్ష్మిగారికి దాదాపు పదేళ్ళ క్రితం పంపిన కొన్ని కథలు, ముఖ్యంగా నాకు బాగా నచ్చిన 'ది బ్లెస్సింగ్‌టన్ మెథడ్' అనే కథ ఇటీవలే ప్రచురించబడ్డాయి. పాత మేన్యుస్క్రిప్ట్ దొరికితే వేసానని దాని ప్రస్తుత ఎడిటర్ శ్రీ చంద్రప్రతాప్ చెప్పారు.

2010లో కె.బి.లక్ష్మిగారు రచయిత్రి శ్రీమతి చలసాని వసుమతి మనవడి పెళ్ళి రిసెప్షన్‌లో నోవాటెల్ హోటల్‌లో తారసపడ్డారు. మాటల్లో ఆవిడ 'మీరు చిన్న కథ రాసి ఏభై రూపాయల పారితోషికం తీసుకునేవారు. దానికి నాలుగింతల కథలురాసి అదే పారితోషికాన్ని మేం తీసుకునే వాళ్ళం అని ఎప్పుడూ అనుకునే దాన్ని' అన్నారు. ఆమె నా రచనలని ఆపేయడానికి కారణం అప్పుడు బోధపడింది. కథ నిడివి ఎప్పుడూ ఇతివృత్తాన్ని బట్టి ఉంటుంది అన్న విషయం ఆవిడకి తెలియదా?

**శ్రీ చంద్రప్రతాప్**


చంద్రప్రతాప్

లక్ష్మిగారి తర్వాత శ్రీ చంద్రప్రతాప్ విపుల, చతుర మాసపత్రికలకి ఎడిటర్‌గా వచ్చారు. గతంలో ఆయన చలసాని ప్రసాదరావు దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసారు. మొదట్లో ఈనాడు సిటీ డెస్క్‌లో, తర్వాత వసుంధర పేజీలో, ఆ తర్వాత తెలుగు భాషాభివృద్ధి డెస్క్‌లో పనిచేసిన ఆయన 2007లో విపుల, చతుర ఎడిటర్ అయ్యాక పూర్వంలా కథలని పంపమని, చతుర ప్రపంచం శీర్షికని పునరుద్ధరించమని కోరారు.

శ్రీ చంద్రప్రతాప్ ఈనాడుకి పనిచేయడం వల్ల అనుకుంటా, ఆయనకి సామాజిక విషయాల మీద చక్కటి అవగాహన, మంచి విశ్లేషణ ఉందని వారి సంభాషణల వల్ల గ్రహించాను. ప్రసాదరావుగారన్నా, రామోజీరావుగారన్నా ఆయనకి బాగా గౌరవం కూడా. అది ఆయన మాటల్లో వ్యక్తం అవుతూంటుంది. అంతా సుఖంగా ఉండాలనే భావన ఆయనలో బలంగా ఉంది. అందుకనే అనుకుంటా దేశంలోని అనేక సామాజిక సమస్యలకి పరిష్కారం రావట్లేదనే బాధ కూడా ఆయన మాటల్లో నాకు కనపడుతూంటుంది.



**శంకు**

1987 ప్రథమార్ధంలో 'అహ నా పెళ్ళంట' షూటింగ్‌కి వచ్చిన శంకుని నాకు శ్రీ జంధ్యాల పరిచయం చేసారు. ఆయన మంచి కార్టూనిస్ట్‌గా నాకు పరోక్ష పరిచయం. ఆయన కారు తాళం చెవులని దాచేసి ఏడిపించి శ్రీ జంధ్యాల తర్వాత ఇచ్చారు. శ్రీ శంకు ఇతరులకి ఎంతో గౌరవం ఇచ్చే మనిషని నాకు మొదటి పరిచయంలోనే అర్థం అయింది. అతనిలో ఎదుటి వారిని హర్ట్ చేయనివ్వని మొహమాటం ఎక్కువ అనిపించింది. ఆ తర్వాత కూడా చాలాసార్లు జంధ్యాలగారి కంపెనీలో కనిపించారు. ఏ.పి.ఎఫ్.డిసిలో అనుకుంటా అతను మేనేజర్‌గా

పనిచేసేవారు. అతని భార్య శోభాశంకర్ ఆంధ్రా బేంక్‌లో ఆఫీసర్. దూరదర్శన్‌లో తెలుగు వార్తలు చదివేవారు. సెన్సార్ బోర్డ్ సభ్యురాలు.

1990లో నేను అమెరికాకి వెళ్ళినప్పుడు సియాటిల్‌లోని తన బంధువు చాగంటి శ్రీనివాస్ అడ్రస్ ఇచ్చి వాళ్ళింటికి వెళ్ళి ఉండమని ప్రోత్సహించారు. ఆ వివరాలు ట్రావెలాగ్ అమెరికాలో రాసాను.

అప్పట్లో ఆయన క్రోక్విల్ హాస్యప్రియ అనే మాసపత్రికని తీసుకు వచ్చేవారు. దానికి నన్ను ఓ సీరియల్ అడిగితే 'ష్! గప్ చుప్' అనే సీరియల్‌ని రాసాను. దానికి బాపుగారి బొమ్మలు అదనపు ఆకర్షణ. అది పుస్తకంగా వచ్చినప్పుడు కొన్ని బొమ్మలని నవల్లో వేసుకోవడానికి వారు ఇద్దరూ అనుమతించారు కూడా. అప్పట్లో దానికి పదివేల రూపాయల పారితోషికం ఇవ్వాలి. ఐదువేలు ఇచ్చారు. ఆ తర్వాత ఇచ్చిన చెక్ బౌన్స్ అయినా నేను వారిని పారితోషికం అడగకుండానే సీరియల్‌ని కొనసాగించాను. వారి కుటుంబ సభ్యుల పెళ్ళికి కూడా నన్ను ఆహ్వానిస్తే వెళ్ళాను.

తర్వాత శంకు దాన్ని దూరదర్శన్‌కి టీవి సీరియల్ కోసం సబ్మిట్ చేస్తూ నా దగ్గర నో అబ్జెక్షన్ లెటర్ మీద సంతకం తీసుకున్నారు. జంధ్యాల దాన్ని నన్ను సినిమాకి అడిగినప్పుడు శంకుగారితో ఆ విషయం తను మాట్లాడతానని చెప్పారు. 'ష్ గప్ చిప్'ని జంధ్యాల సినిమాగా తీసాక విడుదల తేదీ దాకా ఆగి, అప్పుడు దాని హక్కులు తనకే ఉన్నాయని నా మీద, నిర్మాత శాండల్య మీద దర్శకుడిగా జంధ్యాల మీద శ్రీ శంకు కోర్టుకి ఎక్కడం అందరికీ పెద్ద షాక్. సినిమా విడుదల మీద స్టే ఆర్డర్‌ని తెచ్చారు. చివరికి ఆ కేసులో ఆయన గెలవనే లేదు. ఎడిటర్‌గా ప్రచురించిన సీరియల్ మీద ఆయనకి సినిమా రైట్స్ ఉండకపోవడం ఓ కారణం. అవి ఆయా రచయితలకే ఉంటాయి. బౌన్స్ అయిన అతని చెక్‌ని మా లాయర్ కోర్టుకి సబ్‌మిట్ చేసి ఆయన అగ్రిమెంట్ ప్రకారం పారితోషికం ఇవ్వనందువల్ల ఆయనకి నవల మీద ఎలాంటి హక్కూ లేదని చెప్పడం. దూరదర్శన్‌కి సబ్మిట్ చేసి ఆయన అగ్రిమెంట్ ప్రకారం పారితోషికం ఇవ్వనందువల్ల ఆయనకి నవల మీద ఎలాంటి హక్కూ లేదని చెప్పడం. దూరదర్శన్‌కి సబ్మిట్ చేసినంత మాత్రాన అది అప్రూవ్ అవుతుందని గేరంటీ లేదని, ఈలోగా విడుదలయ్యే సినిమా టీవి సీరియల్‌కి అడ్డురాదని లాయర్ కోర్టుకి చెప్పారు. శాండిల్య తమ్ముడు శ్రీ శివ, నేను శంకు గారి ఇంటికి వెళ్ళి దాన్ని విత్‌డ్రా చేయమని కోరాం. శివ కొంత డబ్బుకూడా ఆఫర్ చేసారు. కానీ శంకు అందుకు తిరస్కరించారు. నిజానికి కోర్టుకి ఎక్కాలన్న దుర్బుద్ధి ఆయనకి పుట్టింది కాదని, దగ్గరివారి ప్రోద్బలంతో ఆయన ఆ పనిచేసారని జంధ్యాల తర్వాత నాకు చెప్పారు. నిజానికి జంధ్యాలగారు శంకుతో సినిమా ఆరంభానికి ముందు 'ష్! గప్‌చిప్' నవల గురించి మాట్లాడటం నిర్లక్ష్యం చేసారు.

హాస్యప్రియ మాసపత్రిక కూడా ఆగిపోయింది. ఆ తర్వాత మళ్ళీ శంకు నాకు ఎక్కడా తారసపడలేదు. ఏడాదిన్నర క్రితం ఓ పెళ్ళిలో బఫె డిన్నర్‌లో తిరిగి అతను నాకు తారసపడ్డారు. నిజానికి నా వైపు నుంచి తప్పులేకపోయినా, జరిగింది మర్చిపోయి నన్ను మన్నించమని కోరాను. 'ఏమిటండీ మల్లాదిగారు! అసలు మనం మిత్రులు కానట్లు ఏమిటీ క్షమాపణలు? అసలు మన మధ్య ఏం జరిగిందని?' అని మృదువుగా మందలించారు. తను టీ.వి. సీరియల్స్‌ని డైరెక్ట్ చేస్తున్నానని, మంచి కథని ఇవ్వమని లేదా డైలాగ్స్ రాయమని కోరారు కూడా. నాకు అలాంటి వాటి మీద ఆసక్తిపోయిందని చెప్పాను. ఒకోసారి కొన్ని వ్యామోహాలు మనిషిని చుట్టుముట్టినంత మాత్రాన అతనిలోని మంచి ఇగిరిపోదు. అదిపోయే దాకా తాత్కాలికంగా దానికి గ్రహణం పడుతుందంతే. జీవితంలో ఇది నాకూ అనుభవమే. మళ్ళీ సంస్కారవంతమైన పాత శంకు నాకు ఆ రోజు కనపడ్డారు.


అమృతలత

**అమృతలత**

నిజామాబాద్ నుంచి 1995లో ఒకామె ఫోన్ చేసి తన పేరు అమృతలత అని, కొత్తగా మాసపత్రిక పెడుతున్నామని, నా సీరియల్ కావాలని అడిగారు. హైదరాబాద్‌లోని మా ఇంటికి మరో ఇద్దరు స్నేహితురాళ్ళతో

వచ్చారు. కొత్త పత్రిక పెట్టడానికి ఎవరు వచ్చినా వారికి అందులోని సాధకబాధకాలని వివరించి, పత్రిక మూసేస్తే ఆర్థికంగా నష్టపోతారని నేను వద్దని వారించేవాడిని. ఒకరిద్దరే నిరుత్సాహపడి వెనక్కెళ్ళారు తప్ప, మిగిలిన అందరూ పత్రికని ఆరంభించి చేతులు కాల్చుకున్నారు. ఆవిడకి కూడా నేను అవే మాటలు చెప్పాను. శ్రీమతి అమృతలతకి పత్రిక పెట్టాలనే పట్టుదల ఉండటంతో ఆవిడ వెనక్కి తగ్గలేదు. నిజామాబాద్‌లో అనేక విద్యాసంస్థలని నడుపుతున్నామని ఆమె చెప్పారు. తర్వాత విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కాలేజ్‌ని ఆరంభించారు. అతడు - ఆమె అనే సీరియల్‌ని ఆమె వెలువరించిన మాసపత్రిక అమృత్ కిరణ్‌కి రాసాను. ఆమె నిజామాబాద్‌లో తమ విద్యా సంస్థలో ఓ ఏడాది సాహితీ సదస్సుని కూడా నిర్వహించి దానికి నన్ను ఆహ్వానించారు. కానీ అలాంటి ఫంక్షన్స్‌కి నేను హాజరుకానని నిరాకరించాను. కొద్దికాలానికి పత్రికై మూసేసారు. ప్రచురింపబడని భాగానికి, నా సీరియల్‌కి ఇచ్చిన మొత్తంలోంచి బేలన్స్‌ని ఆమెకి వెనక్కి ఇచ్చేద్దామనుకుని చెక్ ఎవరి పేర పంపాలని ఫోన్ చేసి అడిగితే, ఆమె ఆ డబ్బుని తిరిగి తీసుకోడానికి అంగీకరించలేదు. ఆ తర్వాత కూడా అమృతలతగారు హైదరాబాద్ వచ్చినప్పుడు రెండుమూడుసార్లు నన్ను కలిసారు.

2010 జనవరిలో హరిద్వార్‌లో జరిగిన కుంభమేళాకి వెళ్ళి దాదాపు నెలరోజులు ఉన్నాను. అక్కడ గుజరాత్ నుంచి వచ్చిన వియోగానంద స్వామి అనే మఠాధిపతిని సందర్శించడానికి వెళ్ళాను. ఆయన చెప్పిన ప్రవచనాన్ని నాతో వచ్చిన ఇతర తెలుగువాళ్ళకి అనువదించి చెప్పాను.

అక్కడ ఉన్న ఆయన శిష్యురాలు నన్ను గుర్తుపట్టి, 'మీరు మల్లాది కదా?' అని తెలుగులో అడిగింది. అవునంటే ఆమె మా ఇంటికి అమృతలతగారితో వచ్చానని చెప్పారు. విజయ విద్యా సంస్థల్లో పని చేసేదాన్నని, అక్కడ మానేసి స్వామి దగ్గర ఉంటున్నానని చెప్పారు. 2011 నవంబర్‌లో నేను ఊళ్ళో లేనప్పుడు శ్రీమతి అమృతలత మా ఇంటికి ఫోన్ చేసారు. ఎవరింట్లోనో నేను రాసిన ఆధ్యాత్మిక పుస్తకాలు చూసి ఫోన్ చేసానని చెప్పారుట.

***శ్రీ జొన్నలగడ్డ రాధాకృష్ణ***

శ్రీ రాధాకృష్ణ మయూరి వీక్లీ ఎడిటర్‌గా పని చేసిన కిషోర్ సోదరుడు. జొన్నలగడ్డ రాధాకృష్ణ 1990లలో ఓసారి కిషోర్‌తో మా ఇంటికి వచ్చారు. పోలీస్ రిపోర్ట్ అనే మాసపత్రికకి తను ఎడిటర్‌నని, నా రచనలు కావాలని కోరారు. ఖైరతాబాద్ రైల్వే గేట్ దగ్గర ఓ బిల్డింగ్‌లో మేడ మీద వారి ఆఫీస్ ఉండేది. కొన్ని కథలని ఇస్తే దాంట్లో ప్రచురించారు. తర్వాత అతను సీరియల్ కూడా అడిగారు. కానీ ఆ పత్రిక అంతటితో ఆగిపోయింది. ఇలాగే రిటైరైన ఓ ఐపీఎస్ ఆఫీసర్ సెల్యూట్ అనే మాసపత్రికని మొదలెట్టి నా నుంచి ఓ కథని తీసుకున్నారు. అది కూడా రెండో సంచిక రాకుండా ఆగిపోయింది. అతని సోదరుడిలా రాధాకృష్ణకి కూడా డ్రింక్ అలవాటు బాగా ఉంది. ఓసారి మేం తాగేప్పుడు చొక్కా విప్పి తనకి లివర్ ఆపరేషన్ అయిందని ఓ మచ్చని చూపించారు! సాత్వికంగా ఉండే అతను డ్రింక్ తీసుకుంటే అతనిలో నెగెటివిటీ విజృంభించి, ఎదుట ఉన్న ఎవర్నయినా విమర్శించడం గమనించాను.

***భరద్వాజ***

నేను చిక్కడపల్లిలో 1977లో ఓ గదిలో అద్దెకి ఉండేప్పుడు పక్క సందులో వెండి తెర సినిమా వీక్లీ ఆఫీస్ ఉండేది. శ్రీ శాండిల్య దాని ఎడిటర్. భరద్వాజ అనే అతను వర్కింగ్ ఎడిటర్, సినిమా జర్నలిస్ట్. అతను మా పక్క గదిలో అద్దెకి ఉండేవారు.

ఆ సమయంలో జీతం సరిగ్గా ముట్టక ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేవారు. ఓసారి అప్పడిగితే నేను కొంత ఇచ్చాను. ఎప్పుడూ తెల్లటి పేంటు, షర్ట్‌లనే ధరించేవారు. తర్వాత అతను సితార వార పత్రికలో అనుకుంటా జర్నలిస్ట్‌గా పనిచేసారు. పోలీస్ రిపోర్ట్ ఆఫీస్ ఉన్న బిల్డింగ్‌లోనే భరద్వాజ ఓ పత్రికని నడిపేవారు. అతను బాగా సంపాదించి కారు కూడా కొని ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

**శ్రీ శ్రీరామచంద్రమూర్తి**

వార్త డెయిలీలో శ్రీ ఎబికెగారు వెళ్ళిపోయి శ్రీరామచంద్రమూర్తిగారు ఎడిటర్‌గా చేరాక మా బంధువైన శ్రీ కె.ఆర్.కె.ప్రసాద్ నుంచి ఓ రోజు ఫోన్ వచ్చింది. వార్తకి డెయిలీలో నా సీరియల్ వేసే ఆలోచన ఉందని, ఏదైనా సీరియల్ రాయమని, కోరారు. ఆ సంస్థ యం.డి గిరీష్ సంఘీ గదిలో శ్రీ రామచంద్రమూర్తిగారిని కలిసాను. ఓ నవలకి సినాప్సిస్ చెప్పాను. శ్రీరామచంద్రమూర్తిగారికి కూడా మిగిలిన డైలీ ఎడిటర్స్‌లా కాల్పనిక సాహిత్యం మీద పెద్దగా అవగాహన ఉన్నట్లు తోచలేదు. నేను వార్తకి డైలీ సీరియల్‌గా నివాళి అనే నవలని రాసాను. తరచూ శ్రీ శ్రీరామచంద్రమూర్తిని కలిసి సీరియల్ మీద రెస్పాన్స్ ఎలా ఉందని అడిగేవాడిని.



శ్రీరామచంద్రమూర్తి

ఆ సమయంలో శ్రీరామచంద్రమూర్తిగారు గాంధీనగర్‌లో మా ఇంటికి అర నిమిషం నడక దూరంలోనే ఉండేవారు. ఆయన నన్ను ఎంతో అభిమానంగా చూసేవారు. ఒకటి, రెండు సార్లు వాళ్ళింటికి ఆయన ఆహ్వానం మీద నేను వెళ్ళాను. నాకు ఆయనిచ్చిన దేవీ భాగవతం పుస్తకం ఈనాటికీ నా దగ్గర ఉంది. శ్రీమతి రామచంద్రమూర్తిగారు మంచి భక్తిపరురాలు.

మూసేసే ముందు ఉదయం డైలీ ఎడిటర్‌గా (న్యూస్ ఎడిటర్‌గా?) శ్రీ రామచంద్రమూర్తి విజయవాడ నుంచి హైదరాబాద్‌కి వచ్చారు. ఆయన నా రచనలని ఆపేయమన్నారని శ్రీ చైతన్య ప్రసాద్ ఓ సారి చెప్పారు. చైతన్య ప్రసాద్ చెప్పిన మాటలు వార్తలో ఎడిటర్‌గా పరిచయం అయ్యాక శ్రీ రామచంద్రమూర్తిగారితో చెప్పి 'అది నిజమా?' అని అడిగాను.

"మనం ఎన్నడూ కలవనే లేదు. కాబట్టి మీ మీద నాకు చెడు లేదా మంచి అభిప్రాయాలు ఎలా ఏర్పడతాయి? నేను అలా అనలేదు." ఆయన జవాబు చెప్పారు.

ఎక్కడో కమ్యూనికేషన్ గేప్ వచ్చిందని అనుకున్నాను. శ్రీ చైతన్య ప్రసాద్ కాని, శ్రీరామచంద్రమూర్తిగారు కాని ఈ విషయంలో అబద్ధం ఆడారని నేను భావించడంలేదు.

ఆ తర్వాత ప్రత్యూష, అనగనగా ఒక అతిథి అనే మరో రెండు డైలీ సీరియల్స్ వార్తలో రాసాను. మూడో సీరియల్ కోరినప్పుడు నేను రామాయణాన్ని వాడుక భాషలో రాస్తానంటే, గిరీష్ సంఘీ సమాధానం విని నివ్వెరపోయాను.

"ఈ రోజుల్లో రామాయణం ఎవరు చదువుతారు? మీ సీరియల్ అయితే చదువుతారు కాని."

రామచంద్రమూర్తి గారు వ్యక్తిగతంగా నాకు రెండుసార్లు సహాయం చేసారు.

నేను 1998లో కారు కొన్నాను. అమెరికా నుంచి వచ్చిన ఓ ఫేమిలీ ఫ్రండ్స్ కుటుంబాన్ని నేను గండిపేటలోని వాటర్ వరల్డ్‌కి తీసుకెళుతున్నాను. బషీర్ బాగ్ చౌరస్తాలో ఓ ట్రాఫిక్ ఎస్సై నా కారు ఆపి పొల్యూషన్ చెక్ చేయించుకోలేదని నాకు చలాన్ రాయబోయాడు. నా కారు కొత్తదని, ఇంకా ఆర్నెల్లు కూడా తిరగలేదని చెప్పినా అతను వినలేదు. మా సంభాషణ నాకు బాగా గుర్తు.

"నేను జర్నలిస్ట్‌ని" చెప్పాను.

"ఐతే ఏమిటి?"

"జర్నలిస్ట్‌లతో పెట్టుకోకండి" హెచ్చరించాను.

అతను చలాన్ రాస్తే ఆ డబ్బు చెల్లించి వెళ్ళబోతూ చెప్పాను.

"రేపు వార్త సిటీ ఎడిషన్‌లో మూడో పేజీలో వార్తని చూడండి."

సాయంత్రం సిటీకి తిరిగి వచ్చాక పొల్యూషన్ చెక్‌ని చేయించాను. ఆ సర్టిఫికేట్ తో సరాసరి రామచంద్రమూర్తిగారి దగ్గరకి వెళ్ళి ఆ చలాన్‌ని, సర్టిఫికెట్‌ని చూపించి ట్రాఫిక్ ఎస్సై చేసిన అన్యాయాన్ని వివరించాను. ఆయన దానికి సంబంధించిన రిపోర్టర్‌ని పిలిచి నిజానిజాలు వెరిఫై చేసి దాన్ని వార్తగా వేయమన్నారు.

"మీలాంటి వాళ్ళు ముందుకు వస్తేనే ఇలాంటి అన్యాయాల గురించి రాయగలం. కాని చాలామంది పేరున్న వారు మా దగ్గరకి రారు." ఆయన చెప్పారు.

మర్నాడు ఉదయం నేను చెప్పిన చోటే ఆ వార్త వచ్చింది. డిజిపి చావా రామకోటి నుంచి నాకు ఫోన్ వచ్చింది. అప్పటి ట్రాఫిక్ డిసిపి చలాన్‌లని తగ్గించమని, ముఖ్యంగా పొల్యూషన్ చెలాన్లని ఆపేయమని తన సిబ్బందికి చెప్పారని, నన్ను ఆయనకి రాతపూర్వకంగా ఫిర్యాదుని రిజిస్టర్డ్ పోస్ట్‌లో పంపమని అడ్రస్ ఇచ్చారు. ఆయన చెప్పినట్లే చేసాను. అది అందిన మర్నాడు నాకు డిజిపి ట్రాఫిక్ ఆఫీస్ నుంచి ఫోన్ వస్తే వెళ్ళి ఏసిపిని కలిసాను.

"ఆ ఎస్సై మీద వార్తలో వచ్చిన వార్తవల్ల ఇప్పటికే అతన్ని బదిలీ చేసాం. కాని రాతపూర్వకంగా మీ ఫిర్యాదు అందాక ఆ ఎస్సై మీద ఇంకా ఎక్కువ ఏక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. అతని ఉద్యోగమే పోవచ్చు. మీరేం చేస్తారో మీ ఇష్టం." ఆయన చెప్పారు.

నేను దాన్ని విత్‌డ్రా చేసుకున్నానని నా ఫిర్యాదు మీద రాసి ఇచ్చాను.

"అతనికి చలాన్ రాసే పవర్‌ని తీసేసాం. మీరు కట్టిన చలాన్ మొత్తం ట్రెషరీలో కట్టేసాం. ఆ డబ్బు మీకు కావాలంటే అతని సేలరీ నుంచి రికవరీ చేసిస్తాం." ఆయన చెప్పారు. వద్దని చెప్పాను. చాలాకాలం ఆ వార్త క్లిప్పింగ్‌ని కార్లో డేష్ బోర్డ్‌లోనే ఉంచాను, మళ్ళీ ట్రాఫిక్ వాళ్ళతో ఇబ్బంది కలిగితే దాన్ని చూపించవచ్చని. కాని నియమాల ప్రకారం వెళ్ళే నాకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు.

మరో సందర్భంలో ఎలక్ట్రిక్ రీడింగ్‌ని తప్పుగా చదివి ఎక్కువ బిల్‌ని పంపారు. అది కూడా రామచంద్రమూర్తి గారికి చెపితే తనకీ సరిగ్గా అలాగే జరిగిందని మర్నాడు మెయిన్ షీట్‌లోనే ఆ శాఖని ఘాటుగా విమర్శిస్తూ వార్తని వేసారు. ఆ ఉదయం మా ఇంటికి ఏ.పి.ఎస్.ఇ.బి ఆఫీసర్లు ముగ్గురు, ఒకరు అంబాసిడర్ కార్లో, ఒకరు జీప్‌లో, ఒకరు స్కూటర్ మీద వచ్చి మీటర్‌ని తనిఖీ చేసారు. నన్ను ఎలాగైనా ఇబ్బంది పెట్టాలని విద్యుత్ చౌర్యం జరుగుతోందా అని మీటర్ టేంపరింగ్ జరిగిందా అని, నా కనెక్షన్ అంతా నిబంధనల ప్రకారమే ఉందా అని చూసారు. ఇక ఏం చేయలేకపోయారు. మర్నాడు వార్తలో ఆ పొరపాటుని సరిదిద్దామని వారు ఇచ్చిన జవాబు వచ్చింది. రామచంద్రమూర్తిగారు నాకు దినపత్రిక ద్వారా ఆ సహాయం చేయకపోతే ఇక ఏ.పి.ఎస్.ఈ.బి చుట్టూ ఎన్నిసార్లు తిప్పుకునేవారో. ప్రతీ ఫిర్యాదూ దినపత్రికల్లో వచ్చే అవకాశం అందరికీ అన్నిసార్లు రాదు. ఐనా ప్రతి ప్రభుత్వ శాఖ ఇలా అనుకూలంగా స్పందించే దేశంగా మన దేశం మారితే ఎంత బావుండును? కానీ ఇది చదివేవారు అలాంటి మార్పుని తమ జీవితాల్లో చూస్తారని నేను అనుకోను. అంతలా మన వ్యవస్థ కుళ్ళిపోయింది.

ఓ రోజు శ్రీమతి శారదా అశోక వర్ధన్‌గారు నాకు ఫోన్ చేసి శ్రీ కె.ఆర్.కె.ప్రసాద్ మా బంధువని తెలిసిందని, తను సీరియల్‌ని పంపానని, దాని సంగతి చూడమని చెప్పమని కోరారు. నేనా సంగతి ప్రసాద్‌గారికి ఫోన్ చేసి చెప్పాక అది వార్తలో సీరియల్‌గా వచ్చింది.

మొదటిసారి శ్రీ ప్రసాద్ నన్ను శ్రీ సంఘీకి పరిచయం చేసినప్పుడు ఆయనతో 'వార్త సంస్థ రచయితలకి కాంప్లిమెంటరీ కాపీలు పంపడం లేదని, పంపితే బావుంటుందని' సూచించాను. 'రచయిత పత్రికని కొనుక్కోలేడా?' అని సంఘీ అడిగితే 'ఫలానా సంచికలో వస్తుందని ముందుగా తెలిస్తే తప్పక కొనుక్కుంటారు. అయినా కాంప్లిమెంటరీ కాపీ వస్తే రచయితకి తను గౌరవించబడ్డ భావన కలుగుతుంది.' అని చెప్పాను. 'ఇందులో గౌరవించేదేముంది? రెండురూపాయలు పెట్టి పత్రిక కొనుక్కోవచ్చుగా' అని సంఘీ అంటే, 'మీరు రచయిత అయితే తప్ప నేను చెప్పేది అర్థంకాదు' అన్నాను. మా వాదనని విన్న కె.ఆర్.కె ప్రసాద్ కొద్దిగా కంగారు పడ్డారు. తను కల్పించుకుని మాటలతో మా వాదనని తప్పించారు. నేను ఆయనతో వాదించడం శ్రీ ప్రసాద్‌కి ఇష్టం లేదు అని గ్రహించి ఆపేసాను.

శ్రీ సంఘీ జ్ఞాపకశక్తి అపూర్వం అని నాకు ఓ సందర్భంలో తెలిసింది. నేనాయన్ని కలిసింది మూడు నాలుగు సార్లే. నన్ను ఆయన చూసిన దాదాపు నాలుగేళ్ళకి ఓ రోజు వార్త సండే సప్లిమెంట్‌లో నేను నిర్వహించే మల్లాది పేజీ స్క్రిప్ట్ ఇవ్వడానికి వారి ఆఫీస్‌లోకి వెళుతూంటే, ఆయన ఎదురుపడి విష్ చేసారు. ఆశ్చర్యంగా 'నేను గుర్తున్నానా?' అని అప్రయత్నంగా అడిగాను. 'మాకు సీరియల్స్ రాసారు కదా మీ పేరు మల్లాది' అని చెప్పారు.

కె.ఎల్.ఎన్ ప్రసాద్ ఆంధ్రా ప్రింటర్స్ సంస్థ నుంచి రాధాకృష్ణ ఆంధ్రజ్యోతిని కొనుక్కుని పునఃప్రారంభించినప్పుడు దాని ఎడిటర్‌గా వార్త నుంచి రామచంద్రమూర్తిగారు వెళ్ళారు. ప్రారంభ సంచిక నించే పున్నమి అనే డైలీ సీరియల్‌ని ఆయన నా చేత రాయించారు. ఆ సమయంలోనే ఆయన అమెరికాలోని తన కొడుకు దగ్గరకి వెళ్ళి కొద్దివారాలు ఉండి వచ్చారు. జర్నలిస్ట్‌లు టివి మీడియాకి షిఫ్ట్ అవడం గురించి ఓసారి మా మధ్య చర్చ జరిగింది. కొద్ది కాలానికి శ్రీ శ్రీరామచంద్రమూర్తి ఆంధ్రజ్యోతి నుంచి హెచ్.యం.టివికి వెళ్ళి ఇప్పుడు అక్కడే పనిచేస్తున్నారు. గొల్లపూడి మారుతీరావుగారు ప్రపోజ్ చేసిన వందేళ్ళ తెలుగు కథకి వందనం అనే కార్యక్రమాన్ని రామచంద్రమూర్తిగారు అంగీకరించడం ఆయనకి తెలుగు సాహిత్యం మీద గల అభిమానాన్ని తెలియచేస్తోంది. ఇప్పుడవి ప్రసారం అవుతున్నాయి.

ఆయన వాస్తవాన్ని గ్రహించే చాలా ప్రాక్టికల్ మనిషి.

"మనకి కోపం వచ్చినా లేదా మనకి ఉద్యోగం ఇచ్చినవాడికి కోపం వచ్చినా లేదా అంతా నాకు తెలుసు అని వారు అనుకున్నా మనం బయటకి వెళ్ళాల్సిందే" అని ఒకటి, రెండుసార్లు చెప్పారు. కానీ ఆయనంతట ఆయన మంచి అవకాశం వస్తే ఉద్యోగం మారారు తప్ప వార్త మేనేజ్ మెంట్ కాని, ఆంధ్రజ్యోతి మేనేజ్‌మెంట్ కానీ ఆయన్ని పంపలేదు.

రాజకీయ విశ్లేషణలో, పరిస్థితులని బేరీజు వేయడంలో శ్రీ రామచంద్రమూర్తి దిట్ట. వై.ఎస్.రాజశేఖర రెడ్డి పాదయాత్రని కవర్ చేసే ఓ జర్నలిస్ట్ నేనుండగా ఖమ్మం జిల్లా నుంచి అనుకుంటా ఫోన్ చేసి రామచంద్రమూర్తి గారికి అక్కడి విశేషాలని చెప్పారు. తర్వాత వై.ఎస్.రామచంద్రమూర్తిగారితో మాట్లాడారు.

"పాదయాత్ర ఆయనకి ప్లస్ అయి ఈసారి వై.ఎస్ ప్రభుత్వమే వచ్చే అవకాశాలు చాలా ఉన్నాయి" రామచంద్రమూర్తి నాతో చెప్పారు.

కానీ నేను చంద్రబాబునాయుడే మళ్ళీ గెలుస్తాడని అనుకున్నాను. ఒకవేళ కాంగ్రెస్ గెలిచినా ఎంతో మంది దిగ్గజాలు ఉండగా వై.ఎస్ ముఖ్యమంత్రి అవుతాడన్న గేరంటీ ఏమిటి? అనుకున్నాను. కాని రామచంద్రమూర్తిగారు చెప్పిందే నిజం అయింది.

***(వచ్చే సంచికలో మరి కొన్ని విశేషాలు)***

Click here to share your comments on this story